క్లుప్తంగా

నల్లమలలో నిలిచిన వాహనాలు



నల్లమల ఘాట్ రోడ్డులో ఆగిన వాహనాలు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు నల్లమల ఘాట్‌లో ఓ లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు నుంచి నంద్యాల వైపు బస్తాలతో వస్తున్న లారీ సంకేతిక లోపంతో పాత బొగద సమీపంలో నిలిచిపోయింది. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా తోటి ప్రయాణికులు, వాహనదారులు రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని పక్కకు తోయడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి.

గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు



గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ అమూల్య

వెలుగోడు: గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) వైద్యాధికారిణి అమూల్య సూచించారు. శనివారం గర్భిణులు, రోగులకు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణులకు అవసరమైన పరీక్షలు ఆసుపత్రిలో ఉచితంగా చేస్తామన్నారు. రక్తహీనత నివారణకు పోషక ఆహారం, ఐరన్ టాబ్‌లెట్లు తీసుకోవాలన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై శ్రీశైలంకు చెందిన ఎస్.లక్ష్మీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిద్ధివినాయకశరణం, వినాయక కౌత్వం, గణపతికౌత్వం, మూషికవాహన, తాండవనృత్యం, ఓం నమశ్శివాయ, శివతాండవం, కొలువై ఉన్నాడే తదితర గీతాలకు సర్వజ్ఞ, వరలక్ష్మి, గీత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

శ్రీశైలంలో సీఐ తనిఖీలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ

శ్రీశైలం టెంపుల్: స్థానిక దుకాణాల్లో సీఐ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. గుట్కా, ఖైనీ, సిగరెట్లు విక్రయించరాదని, విద్యార్థులకు కూడా జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ విక్రయించవద్దని యజమానులకు సీఐ సూచించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది రాజేంద్ర కుమార్, రఘునాథుడు, బాలకృష్ణ, నాను నాయక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు

బండి ఆత్మకూరు: కుందూ నదిలో గల్లంతైన మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ముర్తుజావలి హుస్సేన్ (22) కోసం పోలీసులు శనివారం కూడా గాలింపు కొనసాగించారు. ఉదయం గాలింపు చేపడుతుండగా కాకనూరు బ్రిడ్జి వద్ద మృతదేహం నీటిలో కొట్టుకుపోతుండటాన్ని గమనించామని, అందువల్ల దిగువ ప్రాంతమైన భీమవరం బ్రిడ్జి వద్ద డ్రోన్ సాయంతో గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంపై బాధితుల ఆగ్రహం

శ్రీశైలంటెంపుల్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపించారు. శ్రీశైలానికి చెందిన గర్భిణి మమత కాన్పు నొప్పులు వస్తున్నాయని శనివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో పీహెచ్‌సీకి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. వైద్యులు రాలేదని గంటసేపు ఎవరూ పట్టించుకోలేదు. ఆ తర్వాత తీరిగ్గా వైద్యాధికారి వచ్చి చికిత్స చేసి, సున్నిపెంట సీహెచ్‌సీకి రెఫర్ చేశారని గర్భిణి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సీహెచ్‌సీ వైద్యులను మందలించినట్లు సమాచారం.

సమస్యలపై గళమెత్తిన ప్రజా ప్రతినిధులు



సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సమస్యలపై గళమెత్తారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 2024–25, 2025–26 సంవత్సరాలకు సంబంధించి విడుదల కాకపోవడంతో అప్పులు అమ్మి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు ఆర్‌ఎస్కేల వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాసినా దక్కడం లేదని కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి సభ దృష్టికి తెచ్చారు. తుమ్మలూరు, రుద్రవరం గ్రామాల ఆర్‌ఎస్కేలకు ఒక్క బస్తా యూరియా రాలేదని సర్పంచులు రామస్వామి, వరప్రసాద్ ఫిర్యాదు చేశారు. పొగాకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఇస్కాల సర్పంచు మౌలాలి కోరారు. విద్యార్థులకు నాసిరకం బ్యాగులు పంపిణీ చేయడంతో నెలరోజుల్లోనే చిరిగిపోయాయని, అర్హత ఉన్నా చాలా మందికి తల్లికి వందనం డబ్బు అందలేదని ఆయన సభ దృష్టికి తెచ్చారు. పశువైద్య కేంద్రాల్లో పశువులకు ఇంజక్షన్లు వేయడం లేదని, బయటకు చీటీ రాసిస్తున్నారని మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన, ఎంఈఓ బాలాజీనాయక్, డాక్టర్ భాస్కర్, వ్యవసాయాధికారి మహేశ్వర రెడ్డి, ఏఈలు పంచాయతీ రాజ్ రాఘవేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ సువత్సల, కేసీ కెనాల్ శ్రీనివాసులు నాయక్, హౌసింగ్ శ్రీనివాసులు, హార్టికల్చర్ అధికారిణి హరిచందన, ఏపీఎం ఉమామహేశ్వరి, ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించలేరా

- సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు.
- ఎమ్మెల్యే సంబోధనపై సర్పంచ్ అభ్యంతరం



యూరియాపై ప్రశ్నిస్తున్న శాతనకోట సర్పంచు జనార్దన్‌గౌడ్

నందికొట్కూరు: కనీసం యూరియా కూడా రైతులకు అందించలేరా అంటూ పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జయసూర్యతోపాటు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, ఎంపీటీసీలు సురేష్, మంజుల, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు. రైతులు పంటలు కాపాడుకునేందుకు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శాతనకోట గ్రామ సర్పంచు జనార్దన్‌గౌడ్ సభ దృష్టికి తెచ్చారు. కొరత లేదని అధికారులు చెబుతున్నా డీలర్లు కృత్రియ కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో 'ఓయ్ నువ్వు ప్రతిపక్ష పార్టీ సభ్యుడవి, యూరియా కొతర లేకున్నా కావాలని ప్రశ్నిస్తున్నావ్' అంటూ ఎమ్మెల్యే జయసూర్య వ్యాఖ్యానించడంతో సర్పచ్ జనార్దన్‌గౌడ్ అభ్యంతరం తెలిపారు. 'మర్యాదగా మాట్లాడండి ఎమ్మెల్యే గారూ. మీరు మాకు మర్యాద ఇస్తే.. మీకు మేము ఇస్తాం. ఓయ్ అనడం కరెక్ట్ కాదు' అంటూ తీవ్ర అభ్యంతరం తెలిపారు.

పలుకుబడి ఉన్నవారికే ఎరువులిస్తారా

- తాటిపాడు ఆర్‌ఎస్‌కేలో వీపీఏతో రైతుల వాగ్వాదం



వీపీఏ పార్వతితో వాగ్వాదం చేస్తున్న రైతులు

జూపాడుబంగ్లా: పలుకుబడి ఉన్నవారికే ఎరువులిస్తారా అంటూ మండల పరిధిలోని తాటిపాడు గ్రామ రైతులు రైతుసేవా కేంద్రం వీపీఏ పార్వతితో వాగ్వాదానికి దిగారు. శనివారం 266 సంచుల యూరియా మంజూరు కాగా రైతులు ఒక్కొక్కరికి రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని వీపీఏ చెప్పటంతో.. కనీసం మూడు బస్తాలైనా ఇవ్వాలని కోరారు. రెండు రోజుల క్రితం పలుకుబడి ఉన్న వారికి ఐదు బస్తాల చొప్పున ఎలా ఇచ్చారని నిలదీశారు. ఎరువులు రాకముందే అధికారపార్టీ నాయకులు చెప్పిన రైతుల పేర్లు ముందుగానే జాబితాల్లో ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. చివరికి ఒక్కో బస్తా నిర్ణీత ధర రూ.266.50లు కాగా చిల్లర లేదంటూ రూ.270ల నగదు తీసుకొని ఒక్కొక్కరికి రెండు, మూడు బస్తాల యూరియా ఇవ్వడంతో రైతులు శాంతించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో 5న స్పాట్ అడ్మిషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.వాలియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో లభించే దరఖాస్తు ఫారాన్ని నింపి 4వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలన్నారు. 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. సీటు పొందినవారు రూ.5,800 ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9912342068, 9573093123 నంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఆత్మకూరు: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు, పట్టణ పౌర సమాఖ్య నాయకులు రణధీర్, సురేంద్ర, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపు తగదన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, వీరన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం సందర్భంగా వీకెండ్ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొంది.

విద్యా స్వేచ్ఛను హరించే జీఓను రద్దు చేయాలి

నందికొట్కూరు: విద్యా స్వేచ్ఛను హరించే జీఓను రద్దు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ డక్క కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై ప్రశ్నించే విద్యార్థి సంఘం నాయకులను బెదిరించడం దుర్మార్గమన్నారు. ఈనెల 25, 26 తేదీలలో కడప జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సంఘం నాయకులు రాజేష్, గురుబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న కమిషన్ మెంబర్ బాంబే పద్మావతి

శ్రీశైలం ప్రాజెక్టు: ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బాంబే పద్మావతి శనివారం శ్రీశైలం, సున్నిపెంటలో పర్యటించారు. సున్నిపెంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆమె పరిశీలించారు. బాలలకు అందుతున్న విద్య, వసతి, సదుపాయాలు, భోజనం వంటి అంశాలపై ఆరా తీశారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరత ఉందని, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కేవీ శ్రీనివాసులును ఆమె ఆదేశించారు. సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ చిన్నారులకు అందుతున్న వైద్య సదుపాయాలను ఆరా తీశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కోటేశ్వరి, సూపర్‌వైజర్ అంజలి ఉన్నారు.



వేళకు రారు..

సచివాలయ ఉద్యోగులు సమయానికి విధులకు హాజరుకావడం లేదు. తాటిపాడు గ్రామ సచివాలయ ఉద్యోగులు శనివారం 10.30 గంటలైనా హాజరు కాలేదు. డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తప్ప మినహా ఉద్యోగులు తీరిగ్గా ఇష్టానుసారం వచ్చారు. పింఛన్ల లబ్ధిదారులు, సర్టిఫికెట్లు, అమ్మఒడి వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన ప్రజలు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. – జూపాడుబంగ్లా

స్ఫూర్తిప్రదాత పింగళి వెంకయ్య

శ్రీశైలంప్రాజెక్ట్: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య ప్రతిఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.పద్మ, అధ్యాపకులు డాక్టర్.కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, షాహీదా తదితరులు అన్నారు. పింగళి వెంకటయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేశారు.

నిరుపయోగంగా నాగటూరు ఎత్తిపోతల పథకం



నిరుపయోగంగా మారిన నాగటూరు ఎత్తిపోతల పథకం

నందికొట్కూరు: నాగటూరు ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారిందని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని నాగటూరు ఫేస్–1, ఫేస్–2 ఎత్తిపోతల పథకాన్ని పార్టీ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగటూరు ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి 5 వేల హెక్టార్లకు సాగునీరు అందించాలన్నారు. ఆగస్టు నెల వచ్చినా ఎత్తిపోతల పథకం నీరు పారకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా సాగునీరు ఇవ్వకపోతే రైతులను సమీకరించి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

యాప్‌ల భారం తగ్గించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు

ఆత్మకూరు: యాప్‌ల భారాన్ని తగ్గించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రత్నమ్మ డిమాండ్ చేశారు. శనివారం సుదర్శనవర్మ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంపీహెచ్‌ఏ ఫీమేల్, సెకండ్ ఏఎన్‌ఎంలను రీడిప్లయ్‌మెంట్ క్యాన్సిల్ చేసి వారి పూర్వపు సబ్ సెంటర్లకు పంపాలన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్‌ఎంలను మాతృసంస్థ అయిన వైద్య ఆరోగ్యశాఖలో విలీనం చేయాలన్నారు. మెడికల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. సమావేశంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు శ్యామల, జిల్లా ఉపాధ్యక్షురాలు మహేశ్వరి, కల్పలత, వసుంధర, లక్ష్మిదేవి, బేబీ, జ్యోతి, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పూర్తి కాని గదుల నిర్మాణాలు

నత్త నడకన నిర్మాణాలు

జూపాడుబంగ్లా: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థుల కోసం రూ.11.56 లక్షలతో కంప్యూటర్, లైబ్రరీ గదుల నిర్మాణం ప్రారంభించారు. ఆగస్టు నాటికి నిర్మాణం పూర్తిచేసి హ్యాండోవర్ చేయాల్సి ఉండగా ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు చాలీచాలని గదులతోనే కాలం వెల్లదీస్తున్నారు. అలాగే రూ.2.55 కోట్లతో చేపట్టనున్న ఆరు డార్మెట్రీ గదుల నిర్మాణాలు ఇప్పటి వరకు ప్రారంభించకపోవటం గమనార్హం.

సుఖీభవ డబ్బు సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: అన్నదాత సుఖీభవ డబ్బును రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారిణి, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ జేడీ హీరానాయక్ సూచించారు. స్థానిక కార్యాలయంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం మెగా చెక్‌ను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 5,827 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం డబ్బు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శశికళ, తహసీల్దార్ శ్రీనివాసగౌడు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏఓ పాల్గొన్నారు.

అజాగ్రత్తగా ఉంటే అపాయమే!

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్లతో జాగ్రత్త
- స్టార్టర్లు, విద్యుత్ లైన్లకు స్వీయ మరమ్మతులు వద్దు



వరిపంట

బండిఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గాల్లో ఇటీవల వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. రైతులు కూడా సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఇప్పటి ఇప్పటికే దుక్కులు దున్నడం, బోర్ల కింద పిట్ట మడులు సిద్ధం చేయడం, వరినార్లు పెంచడం, మొక్కజొన్న, పత్తి తదితర విత్తుకోవడం వంటి పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. భారీ వర్షాలకు పొలాలు, వ్యవసాయ తోటలు కూడా తడిసిముద్దయ్యాయి. ఈ క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. రైతులు స్టార్టర్ పెట్టెల వద్దకు వెళ్తుంటారు. మోటారు స్విచ్ ఆన్ చేసే క్రమంలో షాక్‌కు గురై, ప్రమాదాలబా రిన పడడం, మృత్యువాత పడుతున్నారు. అలాంటివారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై కథనం.

స్టార్టర్ల వద్ద జాగ్రత్త...

- విద్యుత్ మోటార్ల స్టార్టరు వర్షం నీరు తగలకుండా చెక్కపెట్టెలు, లేదా ప్లాస్టిక్ పెట్టెల్లో అమర్చుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చు.
- ఒక్కోసారి ఎలుకలు విద్యుత్ తీగలను కొరికి (నాశనం) వేస్తాయి. ఈ కారణంగా ఇనుప పెట్టెలకు వైర్లు తగిలి విద్యుత్ సరఫరా జరిగి ఉంటుంది. తెలిసో తెలియక రైతు ముట్టుకోగానే షాక్‌కు గురికావాల్సి వస్తోంది.
- దీని పట్ల జాగ్రత్త వహించాలి. అప్పుడే మరణాలను అరికట్టవచ్చు.
- కొందరు రైతులు అనుభవం ఉన్నట్లు సొంతంగా మరమ్మతులు చేస్తుంటారు. ఇది ప్రమాదకరం. సమస్య చిన్నదైనా సరే విద్యుత్ అధికారులు లేదా దగ్గర్లో ఉండే మోటార్ మెకానిక్లను ఆశ్రయించడం ఉత్తమం.

సలహాలు, సూచనలు తప్పనిసరి...

- విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటార్‌కు మధ్య దూరం ఎక్కువ ఉండరాదు.
- మెయిన్ లైను నుంచి త్రీపేజ్ లాగే వైరుకు ఫ్యూజ్ ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం.
- తడవని ప్రదేశంలో స్టార్జర్ బాక్సు ఉంచుకోవాలి.



మోటారు స్విచ్ఛాన్ చేస్తున్న రైతు

సరఫరాలో లోపం ఉంటే. విద్యుత్ అధికారులు, మెకానిక్‌ను సంప్రదించాలి.

- ఈదురు గాలులు, వర్షాలకు ఎక్కడైనా విద్యుత్ తీగలు, స్తంభాలు విరిగినట్లయితే సంబంధిత అధికారులకు తక్షణం సమాచారం ఇవ్వాలి. అలాంటి చోట సొంత ప్రయోగం మంచిది కాదు.



మోటారు స్విచ్ బాక్స్

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలం వచ్చిందంటే చాలు.. వ్యవసాయ బోర్లు, స్టార్టర్లు, విద్యుత్ తీగల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పొలాలు, విద్యుత్ తీగలు తడుస్తున్నాయి. తేమ ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తాయి. లైన్ నుంచి స్టార్టర్‌కు సరఫరా అయ్యే వైరు నాణ్యతగా ఉండాలి. స్టార్టర్ బాక్సును చెక్క లేదా ప్లాస్టిక్ బాక్సులో అమర్చి, తడిలేని ప్రాంతంలో ఉంచుకోవాలి. చిన్న నిర్లక్ష్యానికి పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సమస్య ఏదైనా తమ దృష్టికి తీసుకొస్తే ఎలా పరిష్కారించాలో చూస్తాం.. అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలకు ముప్పు తప్పదు.

– కంబగిరి, విద్యుత్ శాఖ ఏఈ, బండిఆత్మకూరు

ఏఓకు ఎంపీడీఓ బాధ్యతలు

కొత్తపల్లి: స్థానిక ఏఓ అబ్దుల్ అల్లాం బాషాకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఎంపీడీఓ దాసరి మేరి 20 రోజులు దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లడంతో ఏఓకు అధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

అట్టహాసంగా జూడో ఎంపిక పోటీలు



జూడో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నంద్యాల డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ జూడో బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు నంద్యాల జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. సబ్ జూనియర్ జూడో బాలికల ఎంపిక పోటీలకు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పది సబ్ జూనియర్ విభాగంలో మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 9, 10 తేదీల్లో మంగళగిరిలో జరిగే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ నాయకులు దండె నాగరాజు, విశ్వనాథ్, భాస్కరరెడ్డి, షేక్షావలి, రత్నకుమార్, మహబూబ్‌బాషా, జూడో కోచ్ శాంతరాజు, సయ్యద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.